## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఓయూలో చదువుతున్న విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్స్ (ప్రిలిమ్స్), గ్రూప్ 1, గ్రూప్ 2తో పాటు ఇతర పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు వివరించారు. దరఖాస్తు ఉస్మానియా యూనివర్సిటీ వెబ్సైట్లో పొందుపరిచామని.. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత పత్రాలను జతచేసి ఈనెల 30వ తేదీలోపు అందజేయాలని సూచించారు. విద్యార్థుల రెగ్యులర్ తరగతులకు ఇబ్బంది కలగకుండా మధ్యాహ్నం 2 గంటల నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అన్ని పనివేళల్లో అకాడమీలో సంప్రదించవచ్చన్నారు.

## కక్షసాధింపు చర్యల్లో భాగంగానే..


### కేటీఆర్, కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 14 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన కేసు.. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలో భాగమేనని న్యాయవాది లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ నర్సింగ్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు 353 (2), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తాము ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు ఎలాంటి చర్యలు చేట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకే కేటీఆర్, కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసులను నమోదు చేశారని మండిపడ్డారు.

## రోడ్డు విస్తరణపై నేడు సమావేశం

బండ్లగూడ, జూన్ 14: పోలీస్ అకాడమీ నుంచి చేవెళ్ల మన్నెగూడ వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలనే డిమాండ్‌తో చేపట్టే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని హైవే రోడ్డు విస్తరణ సమితి అధ్యక్షుడు గోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఆదివారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్ఎంపీ పాఠశాలలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు హైవే విస్తరణ సాధన సమితి.. గోపాల్ రెడ్డి 98669 87975, అమరేందర్ గౌడ్ 98497 97059, డా.చంద్ర ప్రకాశ్‌రెడ్డి 98499 04329, మనోహర్ 95050 53497, గోపినాథ్ 94900 73072, భీమ్ రెడ్డి 98482 69319ను సంప్రదించవచ్చు అన్నారు.

# కోతల మోత.. బిల్లుల వాత



### వేసవి కంటే ఎక్కువైన అంతరాయాలు

- గతం కంటే రెట్టింపైన బిల్లులు
- గ్రేటర్‌లో పలుకాలనీల్లో ప్రజల ఇబ్బందులు
- ఇప్పుడు చెట్ల కటింగ్ అంటూ.. పవర్ కట్స్
- పనిచేయని హెల్ప్‌లైన్
- వినియోగదారుల ఆగ్రహం



**గ్రేటర్‌లో మొన్నటి వేసవి కంటే ఇప్పుడే విద్యుత్ కోతలు అధికమయ్యాయి. అవును.. ఎప్పుడు కరెంట్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి గ్రేటర్‌లో నెలకొంది. వర్షాకాలం వచ్చిందంటే..గాలి దుమారంతో చెట్లు, కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడితే సరఫరా నిలిచిపోతుంటుంది. కానీ చెట్ల కటింగ్ పేరుతో విద్యుత్ శాఖ మెయింటెనెన్స్ పనులు చేపట్టడంతో చాలాచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటం కొసమెరుపు అయితే.. వర్షాకాలానికి ముందే చేయాల్సిన పనిని ఇప్పుడు చేస్తుండడంతో పనులన్నీ అడ్డదిడ్డంగా జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండే..చిన్న వర్షానికి కూడా విద్యుత్ నిలిచిపోతుండటం..మరోవైపు కొన్ని చోట్ల అధిక బిల్లుల మోత మోగుతుండటం వినియోగదారులకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది.**

**-సిటీబ్యూరో, జూన్ 14(నమస్తే తెలంగాణ)**

ఒకవైపు మెయింటెనెన్స్ పేరుతో విద్యుత్ కోతలు ప్రకటిస్తే.. అప్రకటిత కరెంట్ కోతలకు లెక్కే లేదు. గ్రేటర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రోజూ గంటలకొద్దీ కరెంట్ సరఫరా నిలిచిపోతుందంటూ వినియోగదారులు డిస్కంకు ఫిర్యాదు చేస్తున్నారు. అసలు ఈ సమయంలో కరెంట్ పోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. లోడ్ తక్కువే అయినా.. వర్షాలు సాధారణంగానే కురిసినా.. కరెంట్ పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే శేరిలింగంపల్లి, బడంగ్‌పేటతో పాటు పలుచోట్ల సాధారణంగా రావాల్సిన కరెంట్ బిల్లుల కంటే రెట్టింపుగా వచ్చాయని వినియోగదారులు వాపోతున్నారు. బడంగ్‌పేట ప్రాంతంలో చాలా ఇండ్లకు కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిందని, ఇలా ఎందుకు వచ్చిందంటే సమాధానం చెప్పే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. ఇక గృహజ్యోతి పథకం లబ్ధిదారులు సైతం జీరో బిల్లురాకపోవడంతో ఆందోళన చెందుతున్న పరిస్థితి.

**పలు కాలనీల్లో అప్రకటిత విద్యుత్ కోతలు..**

భాగ్యనగరంలో నిరంతర విద్యుత్ సరఫరా అందనిద్రాక్షగానే మారింది. తాత్కాలిక మరమ్మతులు తప్ప.. సమస్యల శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడంతో వర్షాకాలం ప్రారంభంలోనే విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. నగరంతో పోలిస్తే శివార్లలో పరిధి ఎక్కువ కాగా అంతరాయాలు ఎక్కువగానే ఉంటున్నాయి.

**అప్రకటిత కోతలు..**

బడంగ్‌పేట, రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి, ఇబ్రహీంబాగ్, మొఘల్‌కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి,కుంట్లూరు, బండ్లగూడ జాగీర్, బాలానగర్, మారుతీనగర్, మీర్‌పేట, నారాయణగూడల్లో అప్రకటిత కరెంట్ కోతలు గంటల కొద్దీ ఉన్నాయంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలరోజులుగా మెయింటెనెన్స్ పేరుతో కొన్నిచోట్ల ప్రకటించిన సమయం కంటే ఎక్కువ సేపు కరెంట్ పోతున్నది. సర్కిళ్ల వారీగా ప్రకటించిన విధంగా ఇన్నిగంటలు కరెంట్ పోతుందని చెప్పినప్పటికీ అంతకంటే ఎక్కువ సమయమే సరఫరా నిలిచిపోతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,. వేసవిలోనే చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉండగా.. వర్షాకాలంలో ఆ ప్రక్రియ చేపట్టడంతో నగరవాసులు మండిపడుతున్నారు. ఒకవేళ మరమ్మతులు అని చెప్పినా వాటికి తగ్గట్లుగా వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ పనులు చేపట్టాలని.. కానీ అలా జరగడం లేదని వారు పేర్కొన్నారు.

**స్పందించేవారే లేరు..**

ఎస్పీడీసీఎల్‌లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రతిసారీ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సీఎండీ ముషారఫ్ క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి సిబ్బందిని అప్రమత్తం చేసినా.. వారు తమ వైఖరిని మార్చుకోవడం లేదు. నాలుగురోజులుగా నగరంలో కరెంట్ పోయిందంటూ.. సుమారుగా 300కు పైగా ఫిర్యాదులు పలు ప్రాంతాల నుంచి వచ్చాయి. ఇవి కేవలం డిస్కంలో నమోదైన ఫిర్యాదులే కాగా.. అసలు తమకు కరెంట్ పోయిందంటూ చెప్పడానికి ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లకు కానీ, సంబంధిత ఏరియాల లైన్‌మెన్లకు కానీ, ఏఈలకు కానీ ఫోన్ చేస్తే స్పందన లేదని పలువురు వినియోగదారులు సోషల్‌మీడియా వేదికగా మండిపడుతున్నారు.

**ఫిర్యాదు చేసినా..**

కుంట్లూరులో ఏఈ, లైన్‌మెన్ స్పందించలేదని ఒక వినియోగదారుడు ఫిర్యాదుచేస్తే, ఫలక్‌నుమా సబ్‌స్టేషన్ పరిధిలో యథాస్థితి ఉందని తెలుస్తున్నది. టీజీఎస్పీడీసీఎల్ యాప్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని, అంతేకాకుండా సమస్య పరిష్కరించకుండానే ఫిర్యాదు మూసేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపాపేటలో ఒకరోజులో ఆరుసార్లు కరెంట్ పోయిందంటూ వినియోగదారులు ఎంతగా మొత్తుకున్నా ఎస్పీడీసీఎల్ సిబ్బంది స్పందించడం లేదు. హెల్ప్‌లైన్లు కూడా డౌన్ ఉంటున్నాయని, లైన్‌మెన్లు స్పందించడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు.



ఎమ్మెల్యే మర్రికి వినతిపత్రం ఇస్తున్న దేవాలయాల కమిటీ సభ్యులు

## బోనాలను వైభవంగా నిర్వహిస్తాం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 14: ఆషాఢ మాస బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆషాఢమాస బోనాలకు దేవాలయాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కోరుతూ దేవాలయాల కమిటీ సభ్యులు శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మచ్చ బొల్లారం మధురానగర్‌లోని శ్రీ వర సిద్ధి మహాగణపతి దేవాలయానికి ఎమ్మెల్యే రూ.65వేల విరాళాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆషాఢ మాస బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలకుండా ఆలయ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బోనాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, జేకే సాయిగౌడ్, శంకర్, శ్రీనివాస్, సురేష్, రమా వివిధ ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రేపు జాబ్, స్కిల్, రుణ మేళా




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న దిలీప్ కుమార్

ఖైరతాబాద్, జూన్ 14: లక్ష్యం సొసైటీ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బషీర్‌బాగ్ పీజీ లా కళాశాలలో జాబ్, స్కిల్, రుణమేళాను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మేళాలో సుమారు 80 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, 3వేల ఉద్యోగాల అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఉద్యోగ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సుమారు 40 స్కిల్, ప్లేస్మెంట్ సంస్థలు పాల్గొంటున్నాయని, ఆరు జాతీయ బ్యాంకులు తమ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఆయా ప్రతినిధులు.. యువ పారిశ్రామికవేత్తలకు ముద్ర, స్టార్టప్, స్టాండప్ రుణాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి, నైపుణ్యాభివృద్ధి, విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, కరీంనగర్ బీజేపీ ఎమ్మెల్యే అంజి రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కుమార్ హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్యం సొసైటీ కార్యదర్శి మల్లేశ్ గౌడ్, సహాయ కార్యదర్శి గల్వె విశాల్, కోశాధికారి గిరి, కార్యవర్గ సభ్యులు ఓంకార్ గౌడ్, రిషబ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

## చందానగర్-అమీన్‌పూర్ రోడ్డు బాగుచేయాలి

### బీజేపీ నేతల నిరసన

కొండాపూర్, జూన్ 14: చందానగర్ నుంచి అమీన్‌పూర్ వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ శనివారం బీజేపీ శ్రేణులతో కలిసి స్థానిక కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని చెప్పిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. నేటి వరకు రోడ్డును అభివృద్ధి చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే రోడ్డు అభివృద్ధి కోసం రూ.45 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ఏండ్లు గడుస్తున్నా.. పరిశీలనలనే తప్ప పనులు ముందుకు సాగడం లేదన్నారు. వర్షం పడితే రోడ్డుపై ఎక్కడెక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.

## ఐటీ కారిడార్‌లో 5కే రన్

కొండాపూర్, జూన్ 14: ఆరోగ్యమే మహాభాగ్యం అనే థీమ్‌తో అంతర్జాతీయ వెల్‌నెస్ డేను పురస్కరించుకొని హైటెక్ సిటీ మెడికవర్ దవాఖాన, టెక్ మహేంద్ర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఐటీ కారిడార్‌లో శనివారం 5కే రన్‌ను నిర్వహించారు. మెడికవర్ ఏజీఎం శైలజ కోట మాట్లాడుతూ.. ఆరోగ్యకర జీవనశైలి పై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 5కే రన్ చేపట్టినట్లు అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది, టెక్ మహీంద్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ డెలివరీ హెడ్ కృష్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



## ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డుపై పరుగులు

### ఆర్టీఏ రూల్స్‌ను లైట్‌గా తీసుకుంటున్న ప్రైవేట్ స్కూల్ బస్సులు

### ఈ ఏడాది ఆర్టీఏ ఫిట్‌నెస్ పరీక్షకు రాని 3071 బస్సులు



సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై ఆర్టీఏ కొరడా ఝులిపిస్తోంది. ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్‌లో 67 బస్సులపై కేసు నమోదు చేసింది. విద్యాసంవత్సరం ప్రారభమైనప్పటికీ వేల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు దూరంగా ఉన్నాయి. సామర్థ్యం పరీక్షలు చేయించకుండానే బస్సులను రోడ్లపై తిప్పుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందునుంచే నోటీసుల జారీ చేస్తున్నా.. విద్యాసంస్థలు వాటిని తేలిగ్గా తీసుకుంటున్నాయి. స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నెన్స్ బిగించాలని, ఫిట్‌నెస్ పరీక్షలన్నీ పూర్తి చేయాలని రవాణా శాఖ గతంలోనే ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను చాలా విద్యాసంస్థలు పాటించడం లేదు. గ్రేటర్‌లో మొత్తంగా విద్యాసంస్థలకు సంబంధించిన 13,500 బస్సులు ఉండగా ఇందులో 3,071 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోలేదు. వీటిపై ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నది.

# లక్ష్యం చేరని లాస్ట్‌మైల్

- రద్దీ పెరుగుతున్నా అందుబాటులోకి రాని రవాణా సదుపాయాలు
- మెరుగుపడని కాలనీలు, మెట్రో స్టేషన్ల అనుసంధానం
- ఫీడర్ బస్సుల ఏర్పాటుపై దృష్టిపెట్టని ఎల్ అండ్ టీ
- నగరంలో 20శాతం కూడా చేరని కనెక్టివిటీ



సిటీబ్యూరో, జూన్ 14(నమస్తే తెలంగాణ): నగరంలో ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనేది పరిహాసంగా మారింది. ప్రధాన మార్గాల గుండా పోతున్న మెట్రోను.. కాలనీలు, ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ ఫీడర్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు సేవలను తీసుకువచ్చే కార్యక్రమంలో నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. మెట్రో జర్నీ చేసి ఇంటికి చేరుకునేందుకు అనువైన రవాణా సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సొంత వాహనాలు, ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించడంతో జేబులు ఖాళీ అవుతున్నాయి.

**మెట్రో రైలు దిగి బయటకు రాగానే...**

మెట్రో స్టేషన్ల నుంచి సమీప దూరంలో ఉండే గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేందుకు వీలుగా మెట్రో సంస్థ ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నగరంలో 69 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో మెట్రో వ్యవస్థ అందుబాటులో ఉంది. ఇందులో ప్రధానమైనవి నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్బీ నగర్ నుంచి మియాపూర్ మార్గాలే.. కాగా ఈ రెండు కారిడార్లలో నిత్యం 3.5లక్షల మందికి పైగానే రాకపోకలు సాగిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఎల్అండ్‌టీ-హెచ్ఎంఆర్ఎల్ ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను కల్పించాల్సి ఉన్నా... పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**ప్రయాణికులపై భారం...**

నగరంలో ప్రస్తుతం ఓలా, ఉబెర్, సువిధ, మెట్రో రైడ్, ఆర్టీసీ వంటి సంస్థలతో మెట్రో స్టేషన్లకు కనెక్టివిటీ కేవలం మొత్తం స్టేషన్లలలో 20శాతం లోపే ఉంది. మిగిలిన స్టేషన్ల పరిసరాల్లో ఉండే వారంతా సొంత వాహనాలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మెట్రోను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో ఛార్జీలతోపాటు అదనంగా స్టేషన్లకు చేరుకునేందుకు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రస్తుతం నగరంలో రెండు కారిడార్లలో 67 మార్గాల్లో ఈ సదుపాయం కల్పిస్తుండగా... ప్రయాణికుడిపై రూ.15-40 వరకు భారం పడుతోంది. కొన్ని సందర్భాల్లో ఫీడర్ సదుపాయాల్లో కలిగే అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లాలాపేట్ లోనివాసం ఉండే శ్రీనివాస్ పేర్కొన్నారు. తాను నిత్యం రాయదుర్గం-తార్నాక వరకు జర్నీ చేస్తుండగా, తార్నాక స్టేషన్‌కు చేరుకునేందుకు, అక్కడి నుంచి రాయదుర్గం నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు మరోసారి ఆటో లేదా రాపిడో వంటి బైక్ ఆపరేటర్లను ఆశ్రయించాల్సి వస్తుందని వివరించారు. ప్రయాణికులపై భారం పడకుండా మెట్రో.. ఎల్ అండ్ టీ సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లైతే ప్రయాణికుల సంఖ్య పెరగడంతోపాటు, అదనపు ఖర్చులు తగ్గుతాయని మెట్రో ప్రయాణికులు వాపోతున్నారు.

# ఈవో నియామకంలో నిర్లక్ష్యం

- సెలవుపై వెళ్లిన తాత్కాలిక ఈవో
- సమీపిస్తున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం
- ఏర్పాట్లపై ముందుకెలా వెళ్లాలని అధికారుల తర్జనభర్జన



బల్కంపేట ఎల్లమ్మ ఆలయం

అమీర్‌పేట్, జూన్ 14: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానానికి పూర్తిస్థాయి ఈవోను నియమించడంలో తెలంగాణ ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆషాఢ మాసం తొలి మంగళవారం రోజున ప్రతిష్ఠాత్మకంగా జరిగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి రెండు తెలుగు రాష్ర్టాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. 3 రోజుల పాటు కొనసాగే అమ్మవారి కల్యాణోత్సవానికి దాదాపు 4 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తుంటారు. అంత ప్రతిష్ఠాత్మకంగా కొనసాగే ఎల్లమ్మ కల్యాణానికి సీఎం కేసీఆర్ సారథ్యంలోని గత తెలంగాణ ప్రభుత్వం హయాంలో దశాబ్ద కాలం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సనత్‌నగర్ ఎమ్మెల్యే, అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కల్యాణోత్సవ ఏర్పాట్లకు నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లకు సంబంధించి అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్షలు నిర్వహించడం చూశాం. ఇక దేవాలయానికి సంబంధించిన అంతర్గత ఏర్పాట్లను అప్పటి ఈవోలు పర్యవేక్షించే వారు. గత దశాబ్ద కాలంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి పూర్తిస్థాయి ఈవోలుగా కొనసాగిన సహాయ కమిషనర్లు వినోదొడ్డి, ఎంవీ శర్మ, ఎం అన్నపూర్ణ వేడుకలను విజయవంతం చేయడంలో తమ శక్తియుక్తులను ఏకం చేశారనే పేరుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత చోటు చేసుకున్న పరిస్థితుల్లో వేడుకల నిర్వహణకు పూర్తిస్థాయి ఈవో నియామకం జరగలేదు. గత ఏడాదికాలంగా దేవాలయ కార్యకలాపాలు ఇన్‌చార్జి పాలనలోనే కొనసాగుతున్నాయి. తాత్కాలిక ఈవో కృష్ణ కల్యాణోత్సవానికి సరిగ్గా 15 రోజుల ముందు ఊహించని విధంగా శనివారం సెలవుపై వెళ్లారు. తాజాగా ఎల్లమ్మ దేవాలయానికి బదిలీపై వచ్చిన మహేందరక్‌గౌడ్ గ్రేడ్-1 ఈవోగా ఉన్నారు. 15 రోజుల్లో ప్రారంభం కానున్న ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని ఎలా ముందుండి నడిపిస్తారనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**ఇన్‌చార్జి ఈవోలతో నెట్టుకొస్తున్నారు...**

2024లో దేవాలయ ఈవోగా కుంట నాగరాజు అనారోగ్య కారణాలతో కల్యాణోత్సవానికి కొద్ది రోజుల ముందే సెలవుపై వెళ్లారు. దీంతో అప్పటి నుంచి తాత్కాలిక ఈవోలే కొనసాగుతున్నారు. కల్యాణోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో అప్పటి సికింద్రాబాద్ సహాయ కమిషనర్‌గా ఉన్న బీ క్రిష్ణను అప్పట్లో ప్రభుత్వం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ ఈవోగా తాత్కాలిక బాధ్యతలపై పంపింది. అయితే ఇక్కడి వివాదాల ఒత్తిడికి తట్టుకోలేని బీ క్రిష్ణ కూడా వెంటనే సెలవుపై వెళ్లడంతో మరో సహాయక కమిషనర్ అంజనీ దేవి ఈవోగా బదిలీపై వచ్చి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆ తరువాత కొద్ది రోజులకే అంజనీదేవి బదిలీ కావడంతో అంతకు ముందు నియమితులైన బీ క్రిష్ణ తిరిగి విధుల్లో చేరారు. ఆ విధంగా పూర్తి స్థాయిలో కాకుండా కేవలం ఇనిచార్జి ఈవోలతోనే కల్యాణోత్సవాలు జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఒత్తిడి మేరకే...!**

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం ఈ మధ్య కాలంలో తరుచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సంవత్సరం ఆరంభంలో టికెట్ వెండింగ్ మెషీన్‌లో చోటు చేసుకున్న నకిలీ టిక్కెట్ల అంశం వెలుగు చూసిన విషయం విదితమే. ఈ సంఘటనపై ఓ చిరుద్యోగిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్న ఆలయ అధికారులు.. వాస్తవాలు వెలికి తీసేందుకు పూర్తిస్థాయి విచారణ జరపలేదు. ఈ విషయంలో దేవాలయంలోని కొందరు ఉద్యోగుల హస్తం కూడా ఉండి ఉంటుందనే ఆరోపణలు గతంలో వినిపించాయి. కోవిడ్ తర్వాత దేవాలయానికి భక్తుల తాకిడి ఊహించని విధంగా పెరగడం, ఆదాయం కూడా అంతే స్థాయిలో పెరగడంతో ఇక్కడ ఈవోగా బాధ్యతల నిర్వహణ కత్తి మీద సాములాగే ఉంటుందని గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు చెబుతుంటారు. తాజాగా ఈవో క్రిష్ణ కూడా ఒత్తిడిని తట్టుకోలేక సెలవైపై వెళ్లారనే ప్రచారం ఉంది. అయితే కల్యాణోత్సవ సమయంలో దేవాలయ ఉద్యోగుల మధ్య అంతర్గత అంశాలు, వివిధ పక్షాల నుంచి ఎదురయ్యే స్థానిక రాజకీయాలను కొత్త ఈవో ఏ విధంగా నెటుకొసారో వేచి చూడాలి.

# రాత్రి 9 దాటిందంటే నిరీక్షణే

- బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- బస్టాపుల్లోనే గంటల తరబడి వెయిటింగ్
- ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయిస్తున్న వైనం
- సిటీలో బస్సులు పెంచాలని వేడుకోలు




సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ ): రాత్రి సమయాల్లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గమ్యస్థానాలకు చేరుకోవడానికి నరకం చూస్తున్నారు. సమయానికి బస్సులు రాక.. గంటల తరబడి బస్టాండ్లు, రోడ్లపైన చీకట్లో నిల్చొని నిరీక్షించాల్సి వస్తోంది. రాత్రి 9 దాటిందంటే బస్సులు ఉండటం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లలో దిగుతారు. వాటి చుట్టుపక్కల ఉన్న సిటీ బస్టాండ్ల నుంచి వారు తమతమ గమ్యాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అయితే రాత్రి సమయంలో ఈ సిటీ బస్టాండ్ల వద్ద బస్సులు సమయానికి రావడం లేదు. ఎప్పుడొస్తుందో కూడా తెలుసుకునే పరిస్థితులు అక్కడ ఉండటం లేదు. దీంతో బస్సు వస్తుందా రాదా అని తెలియక గంటల తరబడి వేచి చూస్తున్నారు. చివరకు ఆటో, క్యాబ్‌ను ఆశ్రయించి గమ్యాలకు చేరుకుంటున్నారు. అర్ధరాత్రి 12.30 గంటల వరకు ఆర్టీసీ గ్రేటర్‌లో బస్సులు నడిపిస్తున్నామని చెబుతున్నా ఆ మేరకు బస్సులు ప్రయాణికులకు అందుబాటులో లేకపోవడం బాధాకరం.

**బస్సులు సంఖ్య పెంచాల్సిందే..**

సరిపడా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో గ్రేటర్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు సంతకాల సేకరణ చేసి ఆర్టీసీ అధికారులకు అందించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి ఉచిత బస్సు స్కీం తీసుకురావడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో 20 శాతం రద్దీ పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి రీజియన్ పరిధిలోని 8 డిపోల పరిధిలో మహిళా ప్రయాణికుల సంఖ్య మిగిలిన డిపోలతో పోలిస్తే అధికంగా ఉంది. వచ్చే కొన్ని బస్సుల్లో దిల్‌షుక్‌నగర్, సికింద్రాబాద్, ఈసీఐఎల్, కూకట్‌పల్లి, మియాపూర్, కోఠి, నాంపల్లి, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్ బస్టాండ్లు మహిళా ప్రయాణికులతో రద్దీని తలపిస్తున్నాయి.

**బస్సులు సరిపోవడం లేదు..**

గ్రేటర్‌లో జనాభా కోటి మించింది. వారి రాకపోకలకు నగరంలో కనీసం 7 వేల బస్సులు సమకూర్చాల్సిన అవసరం ఉందని ఇప్పటికే రవాణా రంగ నిపుణులు నివేదికలు ఇచ్చారు. ఆర్టీసీ నష్టాల కారణంగా బస్సుల సంఖ్య పెంచలేకపోతున్నామంటూ అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌లో 2800 బస్సులు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో ప్రస్తుతం 2600 బస్సులు నడుస్తున్నాయి. 30వేల ట్రిప్పులు కొనసాగుతున్నాయి. ఇవి సరిపోవడం లేదు. మహాలక్ష్మి ఉచిత బస్సు స్కీం రాకముందు గ్రేటర్‌లో ఒక్క రోజుకు 11 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసే వారని అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం వచ్చాక ఒక్క రోజుకు 23లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. దీంతో బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.